
సాక్షి గుంటూరు

శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



ముగిసిన శ్రీరామనవమి వేడుకలు

తెనాలిటౌన్: రూరల్ మండలం కంచర్లపాలెం లోని శ్రీ సీతారామాలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి వేడుకలు గురువారంతో అంగరంగ వైభవంగా ముగిశాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 515.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 2,053 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైభవంగా చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు



పొన్నూరు: మండల పరిధి ములకుదురులోని శ్రీ భూనీలా రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం అర్చకులు స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు గవర్నర్ అబ్దుల్ నజీర్ చీరాల రాక

చీరాల టౌన్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం చీరాల వస్తున్నారని ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు గురువారం తెలిపారు. గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటనకు వస్తున్నారని రాజ్ భవన్ నుంచి సమాచారం అందడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 4 గంటలకు గవర్నర్ వాడరేవులోని ఐటీసీ అతిథి గృహానికి చేరుకుని బస చేస్తారని, శనివారం విజయవాడ రాజ్‌భవన్‌కు ప్రయాణమవుతారని సమాచారం అందించారు. ఈ మేరకు ఆర్డీఓ చంద్రశేఖరనాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గవర్నర్ వ్యక్తిగత పర్యటన నేపథ్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

ఎయిమ్స్‌లో కార్డియాక్ ఐసీయూ విభాగం ప్రారంభం

గుండె జబ్బు రోగులకు

పూర్తి స్థాయిలో వైద్య సేవలు



మంగళగిరి: నగర పరిధిలోని ఎయిమ్స్‌లో గురువారం నూతనంగా కార్డియాక్ ఐసీయూ విభాగాన్ని ప్రారంభించారు. ఇప్పటికే కార్డియాక్ విభాగంలో యాంజియోప్లాస్టీతో పాటు అన్ని రకాల సేవలందుతున్నాయి. అయితే, ఐసీయూ విభాగం లేకపోవడంతో గుండె సంబంధిత రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లక తప్పడం లేదు. అన్ని రకాల వైద్య సేవలతో ఐసీయూ విభాగం అందుబాటులోకి రావడంతో రోగులకు ఎంతో మేలు జరుగుతుందని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

కుడికాలువకు నీటి విడుదల నిలుపుదల



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు అధికారులు గురువారం నీటిని నిలుపుదల చేశారు. సాయంత్రం 4 గంటలకు పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 515.30 అడుగుల వద్ద ఉంది. ఇది 140.8451 టీఎంసీలకు సమానంగా ఉంది. ఇక్కడ నుంచి ఎస్ఎల్‌బీసీకి 841 క్యూసెక్కులు విడుదలవుతోంది.

దుర్గమ్మ సన్నిధిలో ఎన్నికల కమిషనర్లు




ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఏపీ, తెలంగాణ ఎన్నికల కమిషనర్లు గురువారం దర్శించుకున్నారు. తెలంగాణ ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ఇంద్రకీలాద్రికి విచ్చేయగా ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, ఏఈవో చంద్రశేఖర్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలతో వారిని సత్కరించారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన డి. మాల్యాద్రి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,11,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఆలయ అధికారి లక్ష్మణ్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.



నెక్కల్లు గ్రామం

రైతు కంఠాలకు ఉచ్చుముడి

> రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో జరీబు భూమికి ఓ విధంగా, మెట్ట భూమికి మరో విధంగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు కేటాయించారు. భూమి తేడాలను బట్టి దాని విలువను, పరిహారాన్ని నిర్ణయించారు. గ్రామంలో స్థలం విలువ ఎక్కువ... దూరం వెళ్లే కొద్దీ తక్కువగా ఉంటుందనేది వాస్తవం. అలాంటప్పుడు భూముల తరహాలోనే గ్రామాలు, గ్రామ శివార్ల విషయంలోనూ ఉండాలి. భవిష్యత్తు అవసరాలకు భూమి మినహాయింపు ఇవ్వాలి. ప్రభుత్వం ఇచ్చిన మాటపై నిలబడాలి. అది తప్పనిసరి బాధ్యత.

- మేమేమి చేశాం పాపం అంటున్న నెక్కల్లు గ్రామస్తులు
- భూ సమీకరణకు తొలుత సహకరించడం నేరమా?
- ఇతర గ్రామాల్లో పదుల ఎకరాలు మినహాయింపులు
- రాజధాని ప్రాంతంలో సమ న్యాయం ఏదీ?

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: రాజధాని అమరావతి కోసం 2014–2019 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలోని 29 గ్రామాల్లో భూసమీకరణ నిమిత్తం రైతులకు విభిన్న హామీలను గుప్పించింది. రైతులందరి సమ్మతితో అభ్యంతరాలు లేని రీతిలో భూమిని సమీకరించాలని ప్రణాళిక రచించుకుంది. పలుచోట్ల భూసమీకరణకు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు రైతులు తీవ్ర ఆందోళనలు కొనసాగించిన సంగతులు తెలిసినవే. నెక్కల్లు లాంటి గ్రామాల్లోని మెజారిటీ రైతులు తొలుత సానుకూలంగా స్పందించారు. ఆ సమయంలో మంత్రులు పొంగులేటి నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రేయింబవళ్లు తిరిగి ప్రభుత్వం తరఫున హామీలు ఇచ్చారు. గ్రామకంఠాలకు సంబంధించి... గ్రామాన్ని యథాతథంగా ఉంచుతామని, గ్రామస్తుల సమ్మతితో ఆర్–1 జోన్‌ను నిర్ణయిస్తామని, డిమాండ్ ఆధారంగా ఎక్స్‌టెండెడ్ గ్రామకంఠం కింద హద్దులు నిర్ణయిస్తామని చెప్పుకొచ్చారు. గ్రామాల్లోని శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు, వ్యవసాయ, పశు సంబంధిత స్థలాలను గుర్తించి తదనుగుణంగా భవిష్యత్తు అవసరాలకు భూమిని మినహాయిస్తామని, అది గ్రామ శివారు నుంచి 500 మీటర్ల వరకు కూడా ఉంటుందని నమ్మబలికారు. 9.2 కింద అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తామని ఘంటాపథంగా చెప్పారు.

ఊరి ఊరికో న్యాయం

గ్రామకంఠాల పరిధి విషయంలో అధికారులు ఒక్కో ఊరికి ఒక్కో విధంగా నిర్ణయాలు చేశారు. కొన్ని గ్రామాల విషయంలో శివారు వరకే గ్రామకంఠం హద్దుగా నిర్ణయించారు. మరికొన్ని గ్రామాల్లో శివారు నుంచి 500 మీటర్లు, మరికొన్నింటిలో 1000 మీటర్లు అంతకన్నా ఎక్కువగానూ మినహాయింపునిస్తూ హద్దుగా నిర్ణయించారు. నెక్కల్లుకు సంబంధించి చివరి నిర్మాణాలను హద్దుగా గుర్తించి అక్కడికే గ్రామకంఠం పరిమితమన్నారు. దీనిపై గ్రామస్తులు 9.2 ద్వారా అభ్యంతరాలను వ్యక్తం చేశారు. భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్)కు అంగీకరించకపోతే భూసేకరణ (ల్యాండ్ అక్విజేషన్) కింద తీసేసుకుంటామని బెదిరించారు. ఇక తప్పదనుకున్న రైతులు 50 మంది పది సెంట్లు చొప్పున మినహాయింపు కింద తీసుకోవడానికి అంగీకరించారు. మరో పాతిక మంది మాత్రం ఇతర గ్రామాల్లోని వారికి ఏవిధంగా మేలు చేకూర్చుతూ నిర్ణయాలు తీసుకున్నారో అదేరీతిన గ్రామకంఠం కింద భూమిని తమకు కూడా మినహాయించాలని విన్నవించారు. ఇప్పటికీ అదే పట్టుదలతో భీష్మించుకున్నారు.

> ఏదైనా సారూప్యత కలిగిన ఒక పనికి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, వాటి అమలు ఏకరీతిన ఉండాలి. తారతమ్యాలు లేకుండా ప్రజల అవసరాలు, అర్హతలు, పరిస్థితులను బట్టి సమ న్యాయం చేయాలి. పలుకుబడి, సామాజిక పరిస్థితుల ఆధారంగా ఇష్టానుసారం వ్యవహారాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారుల నిర్ణయాలు సహేతుకంగా లేవనో, తప్పులు జరిగాయేమో అనే దాటవేతలతో పాలకులు తప్పించుకోవాలనుకోవడం అన్యాయం. గ్రామాల్లోని బాధితులకు న్యాయం జరిగేలా చూడటం వారి కర్తవ్యం.

ఇదెక్కడి న్యాయమో ?

సమాచార హక్కు చట్టం ద్వారా 2017లో ఏపీ సీఆర్‌డీఏ నుంచి పొందిన మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నెక్కల్లుకు చెందిన 50 మందికి 10 సెంట్లు చొప్పున కేవలం అయిదు ఎకరాలు మాత్రమే మినహాయించగా... తుళ్లూరు, రాయపూడి, మందడం, వెలగపూడి, బోరుపాలెం, అబ్బరాజుపాలెం, లింగాయపాలెం, మల్కాపురం, నేలపాడు, అనంతవరం గ్రామాలకు చెందిన 619 మంది రైతులు 9.2 ద్వారా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గ్రామకంఠం కింద చేర్చాలని కోరగా 285 ఎకరాలను మినహాయించడం గమనార్హం. ఇందులో...

- పది సెంట్లకన్నా మించి భూమి మినహాయింపు పొందిన రైతులు 407 మంది ఉన్నారు. వీరిలోనే 20, 30, 40, 50, 60, 70, 80, 90 సెంట్లు చొప్పున మినహాయింపు పొందిన వారు కూడా ఉన్నారు.
- పై పది గ్రామాల్లోని 407 మంది రైతుల్లో ఒక్క తుళ్లూరు గ్రామానికి చెందిన వారే 141 మంది లబ్ధి పొందిన వారుండటం విశేషం. వీరిలో 10 సెంట్లు మినహాయింపు పొందిన వారు 112 మంది కాగా 11–20 సెంట్లు లోపు 44 మంది, 21–30 సెంట్లు లోపు 21, 31–40 సెంట్లు లోపు 21, 41–50 సెంట్లు లోపు 20, 51–60 సెంట్లు లోపు 05, 61–70 సెంట్లు లోపు 06, 71–80 సెంట్లు లోపు 03, 81–90 సెంట్లు లోపు 16, ఎకరం పైగా మినహాయింపు పొందిన వారు అయిదుగురు రైతులు ఉండటం పరిశీలనాంశం.
- ఒక ఎకరం అంతకు మించి గ్రామకంఠం కింద భూమి మినహాయింపు పొందిన రైతులు అనంతవరంలో 16 మంది, మందడం –13, రాయపూడి–8, వెలగపూడి–7, మల్కాపురం–3, నేలపాడు, లింగాయపాలెం గ్రామాల్లో ఇద్దరేసి చొప్పున ఉండటం రాజధాని గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. పలుకుబడి కలిగిన కొందరికి 8 నుంచి 10 ఎకరాల చొప్పున కూడా గ్రామకంఠం కింద మినహాయింపు దక్కిందనేది విశ్వసనీయ సమాచారం. పై గ్రామాల్లోనే కాకుండా ఇతర రాజధాని ప్రాంతాల్లోనూ గ్రామకంఠాల కింద భూమిని మినహాయించిన దాఖలాలు ఉన్నాయి. అలాంటప్పుడు తమకు ఎందుకు న్యాయం చేయరనేది నెక్కల్లు బాధిత రైతుల ప్రశ్న. తమ డిమాండ్ మేరకు సమన్యాయం జరగాలని, లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పనిసరి పరిస్థితి నెలకొంటుందని హెచ్చరిస్తున్నారు.

పట్టుదలతో అంకురిత దీక్ష

> దేశంలో అత్యున్నత సర్వీసుల్లో కొలువు సాధించాలంటే కఠోరమైన సాధన, అకుంఠిత దీక్ష, పట్టుదల ఉండాలి. ఒకవేళ లక్ష్య సాధనలో అపజయాలు, అటుపోట్లు ఎదురైనా ధైర్యంతో విజయం వైపు ముందుకు సాగాలి. ఐఏఎస్, ఐపీఎస్ సాధించాలంటే మరింతగా శ్రమించక తప్పదు. అయితే, దేశంలో మహిళలపై జరుగుతున్న నేరాలను ప్రాథమిక దశలో కట్టడి చేయాలనే ఆలోచన ఆమెలో ఐపీఎస్ లక్ష్య సాధనకు బీజం వేసింది. దీంతో కఠోరమైన సాధన మొదలైంది. దేశ రాజధాని ఢిల్లీలో ఒక్కొక్క ప్రభుత్వ కొలువుల్లో విధులు నిర్వహిస్తూ.. మరోవైపు ఐపీఎస్ సాధించేందుకు ప్రణాళికను రూపొందించుకున్నారు దీక్ష. తొలి ప్రయత్నంలో ఐపీఎస్‌కు ఎంపికై, దేశవ్యాప్తంగా 208 ర్యాంక్ సాధించారు. తెలంగాణ హైదరాబాద్ అప్పాలో శిక్షణ పూర్తయిన తర్వాత గుంటూరు జిల్లాకు బదిలీయ్యారు.



ట్రైనీ ఐపీఎస్ దీక్ష

ఢిల్లీ టూ గుంటూరు

- తొలి ప్రయత్నంలో ఐపీఎస్ సాధన
- నాలుగేళ్లకు పైగా కష్టపడి లక్ష్యం సాకారం
- ఓ వైపు విధులు నిర్వహిస్తూ పరీక్షకు సిద్ధం
- మహిళలకు భద్రత, రక్షణ లక్ష్యం

నగరంపాలెం: దేశ రాజధాని పశ్చిమ ఢిల్లీ వాసి దీక్ష. తండ్రి దిల్జీత్‌సింగ్ విద్యాశాఖ అధికారి. తల్లి సునీత అసోసియేట్ ఆచార్యులు. ఇద్దరు సోదరులు. ఆమె భర్త ముఖేష్ ఆదాయపుపన్ను శాఖ అధికారి (ఐఆర్ఎస్). 2016లో యూపీఎస్సీ పరీక్షల్లో దీక్ష ఉత్తీర్ణత సాధించారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్‌కు ఎంపికై ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో విధులు నిర్వర్తించారు. ఓ వైపు సమర్థంగా విధులు నిర్వహిస్తూ.. మరలా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. 2018లో డీఎస్పీ ర్యాంకర్ అధికారిగా ఎంపికై ఢిల్లీలో నాలుగేళ్లు పని చేశారు. ఈ సమయంలో అనేక సవాళ్లు, దేశ రాజధానిలో వీవీఐపీల రాకపోకలు, బందోబస్త్ ఇతరత్రా అంశాలపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సి వచ్చేది. 2021లో దీక్ష ఐపీఎస్‌కు ఎంపికై, 208వ ర్యాంక్ సాధించారు. దీంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. ఇక తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ అప్పాలో ఐపీఎస్ శిక్షణ పూర్తి కావడం చకచకా జరిగిపోయాయి. గుంటూరు జిల్లాకు శిక్షణ ఐపీఎస్ అధికారిణిగా ఇటీవల విధుల్లో చేరారు.

నేరాలు కలిచివేసేవి : దీక్ష

ఐపీఎస్ సాధించాలనే లక్ష్యం మొదట్లోనే మదిలో నాటుకుంది. చిన్నారులు, బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారిపై జరిగే నేరాలు మరింతగా కలిచివేసేవి. మహిళలపై నేరాలను తొలిదశలోనే నియంత్రించాలనే ఒక బలమైన కోరిక ఉండేది. సాధ్యమైనంత వరకు వాటిని కట్టడి చేయాలనేది నా ఆశయం. కుటుంబ వివాదాలు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల తలెత్తే దుష్పరిణామాలు, తద్వారా విచ్ఛిన్నమయ్యే కుటుంబాల పరిస్థితులు, సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలపై అవగాహన కల్పించడం, ముందస్తు చర్యలపై కూలంకషంగా వివరించాలనేది లక్ష్యం. ఈ క్రమంలో దేశంలోని అత్యున్న సర్వీస్ ద్వారా మహిళలకు భద్రత, వారికి రక్షణ కల్పించాలనేది ఒక లక్ష్యంగా మారింది. దీంతో ఐపీఎస్ కొలువు సాధిం చేందుకు అహర్నిశలు శ్రమించాను. విధి నిర్వహణలో తీరిక లేకున్నా.. పట్టుదల, అకుంఠిత దీక్షతో రేయింబవళ్లు చదివాను. నాలుగేళ్లకు పైగా కష్టపడ్డాను. ఐపీఎస్‌లో దేశవ్యాప్తంగా 208వ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది. ఏదైనా ప్రభుత్వ కొలువు సాధించాలంటే కఠోరమైన సాధన ఉండాల్సిందే. పోటీ పరీక్షలను పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి. ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో కొలువు సాధించాలనే తపన ఉండాలి. తద్వారా విజయం వైపు నడవాలి.



ఐదు రోజుల్లో ఐదు కోట్ల రూపాయల దోపిడీ కేసు ఛేదన

గుంటూరు జిల్లాకు తొలి పోస్టింగ్ అయినా.. తెలుగు భాషా కొంత వరకు మాట్లాడుతున్నా. జిల్లాలో నేరాల నియంత్రణకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో ముందస్తు చర్యలు చేపడుతున్నాం. సైబర్ నేరాలపై మేళాలు, కొద్ది నెలలు క్రితం జిల్లాలోని మహిళల కోసం ప్రారంభించిన మహిళా మీ కోసం.. మీ భద్రత.. మా బాధ్యత చాలా బాగుంది. సత్ఫలితాలునిచ్చాయి. ఇటీవల మంగళగిరి ఆత్మకూరు వద్ద జరిగిన రూ.5 కోట్ల బంగారు ఆభరణాల దోపిడీ ఘటనను సవాల్‌గా స్వీకరించాం. ఐదు రోజుల్లోనే దోపిడీని ఛేదించాం. సినీ ఫక్కీలో జరిగిన దోపిడీని కొద్ది రోజుల్లో రికవరీ చేయడం మరిచిపోలేని అనుభూతి. ఇక మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని క్వారీ తిరునాళ్లలో సమర్థంగా విధులు నిర్వర్తించాం. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంలో సఫలీకృతులయ్యాం.

హోర్డింగ్స్ పేరుతో దోపిడీ

- కాంట్రాక్టర్లకు కాసులు కురిపిస్తున్న ఎల్ఈడీ స్క్రీన్స్
- నగరంలో పలుచోట్ల అనధికారికంగా నిర్వహణ
- నగరంలో గ్యాంట్రీ హోర్డింగ్స్ 35కి అనుమతి ఇస్తే 40 నిర్మాణం
- వీటన్నింటికీ ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు
- నగరపాలక సంస్థ ఆదాయానికి గండి
- పట్టించుకోని పట్టణ ప్రణాళిక అధికారులు



కొత్తపేటలో గ్యాంట్రీ హోర్డింగ్ కింద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్



లాడ్జి సెంటర్‌లో గ్యాంట్రీ హోర్డింగ్ కింద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గుంటూరు నగరపాలక సంస్థలో దోపిడీ పర్వం రాజ్యమేలుతోంది. నగరంలో పలు ప్రధాన కూడళ్లలో గ్యాంట్రీ(క్రేన్) హోర్డింగ్స్‌కు 35కి మాత్రమే అనుమతి ఉంది. కూటమి నేతలు, అధికారుల అండదండలతో 40 ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, వీటికి ఈ మధ్య ఎల్ఈడీ స్క్రీన్స్ ఏర్పాటు చేసి మరి దోపిడీకి తెరతీశారు. వీటి ద్వారా కాంట్రాక్టర్లకు ఏటా కోట్లాది రూపాయిలు వస్తున్నా కార్పొరేషన్‌కు మాత్రం నామమాత్రంగా మొక్కుబడి చెక్కులు ఇస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. అవి కూడా పాస్ అయ్యేయో..కాలేదో తెలియని పరిస్థితి.

భారీగా వసూలు

నగరంలో ఏర్పాటు చేసే ఒక్కో గ్యాంట్రీ బోర్డుకు కాంట్రాక్టర్లు నెలకు రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల దాకా వసూలు చేస్తున్నారు. ఇందులో రెండు పక్కలా అయితే రూ.1.80 లక్షలు, ఎల్ఈడీ బోర్డ్‌కి 1.20 లక్షలు తీసుకుంటున్నారు. వాస్తవానికి గానూ ప్రతి సంవత్సరం నగరపాలక సంస్థకు ఒక్కో బోర్డుకు రూ. 3.50లక్షలు చెల్లించాలని ఒప్పందం. అయితే, సదరు ఏజెన్సీ నిర్వాహకులు 20 బోర్డులకు మాత్రమే ట్యాక్స్ కడుతున్నట్లు తెలుస్తోంది. 40 బోర్డులకు ప్రతి సంవత్సరం రూ.1.40కోట్లు కట్టాల్సి ఉండగా, కేవలం 20 బోర్డులకు రూ.70 లక్షలే కడుతున్నట్లు సమాచారం. ఇందులోనూ కొంత భాగం చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారిందని కార్యాలయ సిబ్బంది చెప్పుకుంటున్నారు. దీనిపై లోతుగా విచారణ చేపడితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

కరెంట్ బిల్లులు కూడా నగర పాలక సంస్థ ఖాతాలోనే..

హోర్డింగ్స్/బోర్డులు/గ్యాంట్రీ హోర్డింగ్స్ నిర్వహణకు కరెంట్ నగరపాలక సంస్థ సరఫరా చేస్తుంది. దీనికి ఆయా ఆయా ఏజెన్సీలు నగరపాలక సంస్థకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఏజెన్సీలు కనీసం కరెంట్ బిల్లులు కూడా చెల్లించకపోవడంతో రూ. లక్షల్లో బకాయిలు ఉన్నాయని పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. దీనిపై కొద్ది రోజుల కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్వయంగా నగరపాలక సంస్థ సిటీప్లానర్ రూ.9 కోట్లు బకాయిలు ఉన్నాయని ఒప్పుకోవడం గమనార్హం.

స్టెబిలిటీ సర్టిఫికెట్ కూడా మాయే..

నగరంలో ఏర్పాటు చేసిన 40 బోర్డులకు ఎంటయాలో 10 x 20 సైజు పెడుతున్నట్లు చూపారు. కాని వాస్తవంగా చూస్తే 30 x 17 సైజుల్లో ఏర్పాటు చేశారు. 10 x 20 సైజుకు మాత్రమే స్టెబిలిటీ సర్టిఫికెట్ ఉంది. దీనికి తోడు ఎల్ఈడీ స్క్రీన్స్ కూడా ఏర్పాటు చేయడంతో బరువు మరింత పెరిగిపోయింది. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు, గాలి దుమారాలకు గ్యాంట్రీ హోర్డింగ్స్ నిర్వహణ ప్రశ్నార్థకంగా ఉందనే చెప్పుకోవచ్చు. వీటిలోపాలపై డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు పలుమార్లు కౌన్సిల్ వేదిక అధికారులను నిలదీసిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కాని అధికారులు మాత్రం కౌన్సిల్ రోజు వరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని మాట చెప్పడం, ఆ తరువాత దానిని పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది.

ఎల్ఈడీ స్క్రీన్స్ ఎంఓయూలో ఉంది

గ్యాంట్రీ బోర్డులతో పాటు ఎల్ఈడీ స్క్రీన్స్ కూడా ఏర్పాటు చేసుకునేందుకు ఎంఓయూలో ఒప్పందం ఉంది. హోర్డింగ్స్ బకాయిలు వసూలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం.

– రాంబాబు, సిటీ ప్లానర్

‘హ్యాకింగ్’ చిత్రం పోస్టర్ ఆవిష్కరణ



నగరంపాలెం: జిల్లా ప్రజలకు సైబర్ మోసాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో గురువారం హ్యాకింగ్ సినిమా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. హ్యాకర్ల సైబర్ నేరాలపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకులు నరేష్ దోనె, మణివరన్ తెలిపారు. ఇటీవల వచ్చిన ఏఐతో ఫొటో ద్వారా కూడా సరికొత్త సైబర్ నేరాలను హ్యాకర్లు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు వీటి బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలను చిత్రం ద్వారా తెలియజేయనున్నట్లు తెలిపారు. అంజలి సమర్పణలో అనుపమ ఆర్ట్స్ పతాకంపై రావూరి సురేష్‌బాబు చిత్రం నిర్మిస్తున్నారని చెప్పారు. కొన్ని సన్నివేశాలను కొండవీడులో చిత్రీకరించామని, నటిగా ముంబైకు చెందిన కావ్య దేశాయ్ నటిస్తున్నట్లు వారు తెలిపారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ తరగతులు

నెహ్రూనగర్: మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ కోసం గుంటూరు జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి కె. మయూరి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు 10వ తరగతి, టీటీసీ, బీఎడ్, టెట్ మార్కు లిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణలు, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేసి రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్, గుంటూరు కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇతర వివరాలకు 0863–2358071 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,000** గరిష్ఠం : రూ. **7,000**

మోడల్ ధర రూ. **5,500**

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు గురువారం 930 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 668 బస్తాలు రాగా కనిష్ఠ ధర రూ.10,300, గరిష్ఠ ధర రూ.12,425, మోడల్ ధర రూ.11,400 పలికినట్లు ఆయన పేర్కొన్నారు. కాయలు 262 బస్తాలు రాగా కనిష్ఠ ధర రూ.10,116, గరిష్ఠ ధర రూ.12,000, మోడల్ ధర రూ.11,401 పలికినట్లు తెలిపారు. మొత్తం 697.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలియజేశారు.

యార్డుకు 1,25,167 బస్తాలు మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,25,167 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,22,136 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,600 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 65,764 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

కొల్లిపర: నాలుగేళ్ల బాలికపై అత్యాచార యత్నం చేసిన నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష , రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన 53 ఏళ్ల పాముల సురేష్ అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి చేసేందుకు 2021లో ప్రయత్నించాడు. గమనించిన తల్లి అడ్డుకుని పోలీసులను ఆశ్రయించింది. అప్పటి కొల్లిపర ఎస్ఐ బలరాం రెడ్డి కేసు నమోదు చేయగా, హెడ్‌కానిస్టేబుళ్లు కరీముల్లా, ఏడుకొండలు, నరసింహారావు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించారు. కేసు గురువారం విచారణకు రావడంతో సాక్షులను ప్రస్తుత ఎస్ఐ పి. కోటేశ్వరరావు కోర్టులో హాజరు పరిచేందుకు చొరవ చూపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి ఇందిరా ప్రియదర్శిని నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

‘డై’యేరియాతో బీ కేర్‌ఫుల్ !

- వేసవిలో అతిసారం వ్యాపించే అవకాశం
- గత ఏడాది 388 కేసులు నమోదు
- ఒకరు మృతి
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలి




డయేరియా బాధితుల చిత్రాలు

గుంటూరు మెడికల్: వేసవిలో వచ్చే వ్యాధుల్లో అతిసారం (డయేరియా) ముఖ్యమైంది. సకాలంలో వైద్యం చేయని పక్షంలో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ప్రతి ఏడాది వేసవిలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కేసులు నమోదవుతూనే ఉన్నాయి. గత ఏడాది గుంటూరు నగరంలోని శారదా కాలనీలో 326 కేసులు నమోద్వగా, ఒకరు చికిత్స పొందుతూ చనిపోయారు. చేబ్రోలు పీహెచ్‌సీ, మంచాల గ్రామంలో 62 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుత వేసవిలో వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి.

కారణాలు

విరేచనాలు నీళ్లుగా, పలచగా అవుతుంటే డయేరియా(అతిసారవ్యాధి) అంటారు. వైద్య పరిభాషలో దీన్ని ‘గ్యాస్ట్రో ఎంటెరైటిస్’గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణవ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరేచనాలు నూటికి 70శాతం వైరస్ క్రిముల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగడం వల్ల, మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాలపై వాలాకా తినడం ద్వారా వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి.

లక్షణాలు

- జీర్ణ వ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉడి వాంతులు, విరేచనాలు అవుతాయి.
- విరేచనాలు నీళ్లుగా, పలుచగా కావడం, కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి ఉంటుంది.
- నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కల నొప్పులు వస్తాయి.
- మనం తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోయి డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది.
- డీహైడ్రేషన్‌లో నాడి వేగంగా లేదా బలహీనంగా కొట్టుకోవటం లేదా ఒక్కోసారి అసలు తెలియపోవడం ఉంటుంది
- నీరసం, నోరు, నాలుక, పిడచ కట్టుకుపోవడం, శరీరం ఎండిపోవడం ఉంటుంది
- ఒక్కోసారి మూత్రం అసలు రాకపోవడం లేదా చాలా తక్కువగా రావడం లేదా ముదురు పసుపు రంగులో వస్తుంది.
- వయస్సుతో సంబంధం లేకుండా డీ హైడ్రేషన్ వస్తుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

పిల్లలకు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి

డయేరియా వల్ల పెద్దవారికంటే పిల్లలకు ఎక్కువగా ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయి. వ్యాధి లక్షణాలు గుర్తించి దాహం పెరిగితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తారు. ఒక ప్యాకెట్ పౌడర్‌ను లీటర్ నీటిలో కలుపుకుని తాగాలి. విరేచనాలు అయ్యేవారికి కారం, మసాల వంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. వ్యాధి తగ్గే వరకు వారికి వైద్యుల సలహా ప్రకారం మందులు, ఆహారం అందించాలి.

కాచి చల్లార్చిన నీరు తాగాలి



డయేరియా బాధితులకు ద్రవ రూపంలో ఉండే మజ్జిగ, పాలు, బార్లీ గంజి, పలచగా తయారు చేసిన సగ్గుబియ్యం, రాగి జావ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, సోయాబీన్స్ రసం, ఇతర పళ్ల రసాలు ఇవ్వొచ్చు. మల మూత్ర విసర్జన తర్వాత, భోజనం చేసే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడం చాలా ఉత్తమం. ఇంట్లో వైద్యాలు, మందుల షాపుల వద్దకు వెళ్లి మందులు తెచ్చుకోవడం చేయవద్దు. డయేరియా వచ్చినప్పుడు అర్హత ఉన్న వైద్య నిపుణుడి వద్దకు వెళ్లాలి.

–డాక్టర్ షేక్ నాగూర్ బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు

ఉచితంగా వైద్య సేవలు



వేసవిలో కేసులు నమోదయ్యే దృష్ట్యా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. బాధితులకు చికిత్స అందించేందుకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండేసీ పడకలు ప్రత్యేకంగా అందుబాటులో ఉంచాం. మందులు, సెలైన్లు, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి ముందస్తుగా గుర్తించి నివారణ చర్యల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అతిసార వ్యాధి బాధితులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాం.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి , డీఎంహెచ్ఓ, గుంటూరు

మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్ నాశనం

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ



ఈగల్ ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు వెస్ట్ : మాదక ద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తు నాశనంతో పాటు దేశ అభివృద్ధిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ కమ్యూనిటీ విజిలెన్స్ అవగాహన సదస్సును జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకాలపై కేసులు నమోదవుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు వీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. వినియోగం అరికట్టేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పోలీసులు సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిషేధిత మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాల కేసుల్లో వ్యక్తులను అరెస్టులు చేసి విచారించేటప్పుడు, ఉన్నత విద్యా సంస్థల్లోని విద్యార్థులకు వీటిని తీసుకొచ్చినట్లు తెలిపారన్నారు. ముఖ్యంగా యూనివర్సిటీల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ విద్యనభ్యసిస్తున్న వారు అధికంగా సేవిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని పేర్కొన్నారు. విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి, నిషేధిత మత్తు పదార్థాలను విద్యార్థులు వినియోగించకుండా చూడాలని కోరారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పోలీసు శాఖ రూపొందించిన ఈగల్ ప్రచార పోస్టర్లను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, డీఈఓ రేణుక, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, జిల్లా అధికారులు ఆవిష్కరించారు.

లబ్ధి చేకూర్చిన వారిపై నిందలు సరికాదు

పిడుగురాళ్ల: రాజకీయ లబ్ధి చేకూర్చిన వారిపై నిందలు మోపటం సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పల్నాడు హాస్పిటల్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర మంత్రి అమిత్ షాకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు లేఖ రాస్తూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై సీబీఐ కేసులు, ఈడీ కేసులు ఉన్నాయనడం సరికాదన్నారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఎంపీగా గెలిచి ఇలా మాట్లాడటం సబబు కాదని పేర్కొన్నారు. రాజకీయ భిక్ష పెట్టిన వారిని, వారి ద్వారా లబ్ధి పొంది ఇలా మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో నడిరోడ్డుపై హత్యా రాజకీయాలు చేస్తున్న తీరుపై, బార్ షాపు యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్న వైనంపై నిలదీశారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్రానికి లేఖ రాయాలని ఆయన కోరారు.

కిరణ్ ఒక్కడే కాదు.. ఎందరో ఉన్నారు !

- ప్రతి ఒక్కరినీ శిక్షించాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకిరెడ్డి నాగ నారాయణమూర్తి



తాడేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నారాయణమూర్తి తదితరులు

తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో కిరణ్‌లాంటి వాళ్లు ఎంతో మంది వైఎస్సార్ సీపీ మహిళా ప్రజా ప్రతినిధులు, మంత్రులు, మహిళల గురించి అసభ్యంగా మాట్లాడుతూ అసభ్యకర పోస్టులు పెడుతున్నారని, వారందరినీ కూడా ప్రభుత్వం శిక్షించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు అంకిరెడ్డి నాగ నారాయణమూర్తి డిమాండ్ చేశారు. తాడేపల్లి పోలీస్టేషన్‌లో గురువారం చేబ్రోలు కిరణ్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ,ఆయన సతీమణి భారతిపై కిరణ్ చాలా అసభ్యకరంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్నారు. పోలీసులు ఆయనపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సోషల్ మీడియా వేదికగా కొంతకాలం నుంచి వైఎస్సార్ సీపీ మహిళలపై, నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులపై అసభ్యకరంగా మార్ఫింగ్‌లు చేసి పోస్టులు పెడుతున్నారని తెలిపారు. కిరణ్‌పైనే కాకుండా మిగిలిన వారిపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మహిళలను కించపరిస్తే సహించమని తెలిపారు. , కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు దొడ్డ అంజిరెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీల అధ్యక్షులు కొండమడుగుల సుధాకర్‌రెడ్డి, కొలుసు మోహన్ యాదవ్, కొండకాయల వంశీ, కృష్ణ, సత్తిరెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంలో సర్వే శాఖ పాత్ర కీలకం

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ



రక్తదానం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

గుంటూరు వెస్ట్: భూ సమస్యల పరిష్కారంలో సర్వే శాఖ పాత్ర ఎంతో కీలకమని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. జాతీయ సర్వే దినోత్సవంలో భాగంగా ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ భూమిపై మమకారం ఉంటుందని తెలిపారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 10న జాతీయ సర్వే దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, 53 మంది సర్వే శాఖ ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన సర్వేయర్లకు ఇన్‌చార్జి కలెక్టర్‌తోపాటు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్. మల్లికార్జునరావు, కార్యదర్శి ఆర్. మల్లికార్జునరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.లక్ష్మీనారాయణ, పి.వి. భావన్నారాయణ, సాంబశివరావు పాల్గొన్నారు.

తెనాలి లాయర్స్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి

తెనాలి: పట్టణానికి చెందిన న్యాయవాదుల చరిత్రపై రూపొందించిన ‘తెనాలి లాయర్స్ డైరీ’ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ పి.వెంకట జ్యోతిర్మయి గురువారం తన చాంబరులో ఆవిష్కరించారు. తెనాలి న్యాయవాది గుంటూరు కృష్ణ ఈ డైరీని రూపొందించారు. తెనాలి న్యాయవాదులు సమాజానికి చేసిన సేవలను, వృత్తిలో ఎదిగిన విధానాలను డైరీలో భావితరాలకు ఉపయోగపడేలా రూపొందించడం అభినందనీయమని వెంకట జ్యోతిర్మయి అన్నారు. 2011, 2018లో తెనాలి లాయర్స్ డైరీని తీసుకురాగా, మార్పులు చేర్పులతో ప్రస్తుతం ముద్రించినట్లు కృష్ణ చెప్పారు. తెనాలి కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి హైకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన డాక్టర్ వెంకట జ్యోతిర్మయి చేతుల మీదుగా డైరీని ఆవిష్కరింప చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. సహకరించిన పట్టణ ప్రముఖులు, న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు. హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి నన్నపనేని శ్రీహరి, హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు గొడవర్తి కిరణ్‌బాబు పాల్గొన్నారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పురందేశ్వరి

మేడికొండూరు: పార్టీ నేతలంతా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. మండలంలోని పాలడుగులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ‘గావ్ చలో’ అభియాన్ (పల్లెకు పోదాం చలో) కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. అనంతరం మేడికొండూరు మండల మాజీ అధ్యక్షుడు ఆమతి వెంకటరమణ నివాసంలో స్థానిక నాయకులతో మాట్లాడారు. పార్టీ నేతలంతా ప్రజలకు చేరువ అవడానికి కృషి చేయాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన రచ్చబండ సమావేశంలో మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు బాషా, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు, జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు

మోదీ ఫొటో లేకపోవడంపై ఆగ్రహం

పాలడుగు సచివాలయంలో ప్రధానమంత్రి మోదీ చిత్రపటం లేకపోవడంతో పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ఫోటోను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు.

ఆటో బోల్తా పడి 10 మందికి గాయాలు



తెనాలి రూరల్: కుక్కలను తప్పించబోయి ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ సహా 10 మంది గాయాలపాలయ్యారు. తెనాలి వైకుంఠపురం సమీపంలో గురువారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం మూల్పూరు గ్రామానికి చెందిన ధర్మ, యాకోబు, బెంజమిన్, మరియమ్మ, శ్యామల, వెంకటరత్నం, అమ్మారావు, సుశీల, సైమాన్ రాయి పని కోసం తెనాలి మండలం కొలకలూరుకు కొద్ది రోజులుగా వస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మూల్పూరుకే చెందిన ఆటో డ్రైవర్ మూల్పూరి నరేష్ ఆటోలో వీరు వస్తున్నారు. తెనాలి వైకుంఠపురం సమీపంలో రహదారిపై మూడు కుక్కలు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా కొట్టడంతో అందులోని 10 మంది గాయపడ్డారు. 108లో వారిని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో యాకోబు పరిస్థితి విషమంగా ఉండంతో గుంటూరు పంపారు. ఘటనపై త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పలు విభాగాల అధ్యక్షులుగా నియమిస్తూ ఆదేశాలు వెలవడ్డాయి. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా తెనాలికి చెందిన ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పొన్నూరుకు చెందిన తాడిబోయిన వేణుగోపాలరావు, సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కొరిటెపాటి ప్రేమ్‌కుమార్‌ను నియమించారు.

సమాజ హితమే సాహిత్యం పరమావధి



బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ సుబ్బారావు



డీఐజీ విజయారావుకు సత్కారం

తాడేపల్లి రూరల్: మాతృ భాషలు మృత భాషలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. ఏ ప్రాంత సంస్కృతి పరిరక్షించబడాలన్నా ఆ ప్రాంత భాష ముందుగా రక్షింపబడాలని తెలిపారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బీఏ (ఐఎఎస్) విభాగం ఆధ్వర్యంలో గురువారం ‘‘ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు, వాదాలు – సమాలోచన’’ అనే అంశంపై ప్రారంభమైన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్యం పరమావధి అని పేర్కొన్నారు. రాష్ట్ర రహదారుల భద్రతా విభాగం డీఐజీ సీహెచ్. విజయారావు మాట్లాడుతూ మాతృభాషలో సివిల్ సర్వీసెస్ రాసి లక్ష్యాన్ని సాధించడం సులువని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ ప్రచురించిన 11 సంవత్సరాల యూపీఎస్సీ పాత ప్రశ్నపత్రాలు – సమాధానాలు, విశ్లేషణతో కూడిన గ్రంథాన్ని ఆవిష్కరించి, ఉచితంగా విద్యార్థులకు అందజేశారు. వాణిజ్య పన్నుల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డి. రాంబాబు మాట్లాడుతూ తెలుగు ప్రధాన అంశంగా తీసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత మార్గ నిర్దేశం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర లయోలా విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ గుమ్మా సాంబశివరావు, రచయిత్రి నైనాల వాణిశ్రీ , బీఏ విభాగాధిపతి బి. శివనాగయ్య, సహాయ ఆచార్యులు అద్దంకి ప్రజాపతి, వర్సిటీ వీసీ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీలు ఏవీఎస్ ప్రసాద్, కె. రాజశేఖర రావు, ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, బీఏ ఉప విభాగాధిపతి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఉమెన్ పీఎస్ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి

నగరంపాలెం: రాష్ట్రంలో గురువారం 17 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు ఉమెన్ పీఎస్ డీఎస్పీ బి.వి. సుబ్బారావును ఏసీబీ డీఎస్పీగా, వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని గుంటూరు ఉమెన్ పీఎస్ డీఎస్పీగా బదిలీ చేశారు.